సాక్షి కర్నూలు

గురువారం । 13 । జూలై । 2023



కేసీకి 189 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాలకు సుంకేసుల డ్యాం నుంచి బుధవారం 189 క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్‌కు విడుదల చేశారు. డ్యాంలో 0.917 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బళ్లారికి చెందిన పి. అనురాధ రూ.1,00,150 విరాళంగా అందజేశారు.



సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణార్థమై శ్రీశైలమహాక్షేత్రంలో బుధవారం సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శాశ్వత లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్): శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించి ప్రజలు సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలులో ఏర్పాటైన శాశ్వత లోక్ అదాలత్‌కు విశ్రాంత న్యాయమూర్తి ఎం.వెంకట హరినాథ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఇక్కడ ఇచ్చే తీర్పులు సుప్రీం కోర్టు తీర్పులతో సమానమన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం, సేవల్లో కలిగే నష్టాలను విన్నవించి న్యాయం త్వరగా పొందవచ్చన్నారు. వివిధ సేవల్లో లోపం కలిగితే ఎటువంటి కోర్టు ఫీజు లేకుండా తగిన ఆధారాలతో వినతిపత్రం ద్వారా శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఎస్‌సీ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షలు కర్నూలులోని అయాన్ డిజిటల్‌లో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. నాలుగు షిఫ్టుల్లో ఆన్‌లైన్‌లో ఈనెల 19 తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 15,364 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కో ఆర్డినేటర్‌గా డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు వ్యవహరించనున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస కుమార్‌ను నోడల్ అధికారిగా నియమించారు.

క్యాన్సర్ యూనిట్‌కు 247 పోస్టులు మంజూరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు 247 పోస్టులు మంజూరు చేస్తూ రాష్ట్ర కేబినెట్ బుధవారం ఆమోదించింది. ప్రస్తుతం రూ.120కోట్ల అంచనాతో నిర్మాణం జరుగుతున్న క్యాన్సర్ యూనిట్ దాదాపుగా పూర్తి కావచ్చింది. మెడికల్ ఆంకాలజిస్టు, సర్జికల్ ఆంకాలజిస్టు, రేడియోథెరపీ వైద్యులతో పాటు నర్సులు, పారామెడికల్ ఉద్యోగులు, ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ మేరకు ఆసుపత్రి అధికారులు ప్రభుత్వానికి 270కి పైగా పోస్టులు కావాలని ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు బుధవారం 247 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై వైద్యవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఐటీఐ దరఖాస్తుకు నెలాఖరు వరకు గడువు

కర్నూలు సిటీ: ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ కాలేజీల్లో రెండో విడత ప్రవేశాల కోసం ఈ నెలాఖరు వరకు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ ఐటీఐ(బాలికల)కాలేజీ ప్రిన్సిపాల్ పి.సూరప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు ఖండేరిలోని డీఎల్‌టీసీలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్టేనోగ్రఫీ, విద్యార్థినులకు సివింగ్ టెక్నాలజీ(టైలరింగ్)లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆగస్టు 4వ తేదీ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

కలెక్టరేట్‌లో మిల్లెట్ కేఫ్

- ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఈ నెల 20న ప్రారంభించనున్న కలెక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో మిల్లెట్ కేఫ్ ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఆంధ్రప్రదేశ్ విత్తన రైతు సేవా సంఘం (ఏపీవీఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న మిల్లెట్ కేఫ్‌ను ఈ నెల 20న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించనున్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్ సాగును ప్రోత్సహిస్తూనే.. మిల్లెట్స్ వినియోగాన్ని పెంపొందించే దిశగా చర్యలు చేపడుతోంది. కలెక్టరేట్‌లో ఏర్పాటవుతున్న మిల్లెట్ కేఫ్‌లో కొర్రలు, సామలు, ఊదలు, అరికలు, అండుకొర్రలు, రాగులు, జొన్నలు, సజ్జలకు సంబంధించిన అన్నం, మిక్చర్, మురుకులు, లడ్డు, బిస్కెట్లు, జొన్న సంకటి, చిరుధాన్యాల బ్రెడ్, గంజి, రోటీ లభిస్తాయని ఏపీవీఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేణుబాబు తెలిపారు.

మార్గం.. సుగమం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పల్లెలు, పట్టణాల్లో 'దారి'ద్ర్యం తొలగిపోతోంది. అధ్వానంగా ఉన్న రహదారులు అద్దంలా మెరవబోతున్నాయి. అధికారులు ప్రతిపాదనలు పంపిన వెంటనే నిధుల మంజూరవుతున్నాయి. ప్రజలకు ప్రయాణ కష్టాలు తొలగుతున్నాయి.



రూపుదిద్దుకోనున్న నందికొట్కూరు - ముచ్చుమర్రి రోడ్డు

- రూ.36.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- బాగుపడనున్న రాష్ట్ర, జిల్లా రహదారులు
- రూపుదిద్దుకోనున్న 65 కి.మీ దారులు

కర్నూలు (న్యూసిటీ): రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడా గతుకులు లేకుండా ప్రయాణం సాఫీగా సాగేలా రోడ్లను బాగు చేస్తోంది. అవసరమైన చోట కొత్త రోడ్లు వేస్తోంది. పల్లెల్లో, పట్టణాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని రహదారులను విస్తరిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రహదారుల అభివృద్ధికి ఇటీవల రూ.36.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 65.147 కి.మీ మేర రోడ్లు సుందరంగా రూపుదిద్దుకోనున్నాయి. మంజూరైన నిధుల్లో కర్నూలులో జిల్లాకు రూ.11 కోట్లు, నంద్యాల జిల్లాకు 25.50 కోట్లు కేటాయించారు.

మరికొన్ని ప్రతిపాదనలు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 83.628 కి.మీ మేర రోడ్ల నిర్మాణ పనులకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ప్రభుత్వానికి మరికొన్ని ప్రతిపాదనలు పంపారు. కర్నూలు డివిజన్ పరిధిలో ఉన్న రోడ్లకు నిర్మాణానికి 30.8 కి.మీలకు రూ.27.85 కోట్లు, ఆదోని డివిజన్‌లో 57 కి.మీటర్లకు 17.40 కోట్లు, నంద్యాల జిల్లాలో 43.147 కి.మీటర్లకు రూ.24.74 కోట్లతో ప్రణాళికను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

జిల్లాల సరిహద్దులు కలుపుతూ..

ఉమ్మడి ఉమ్మడి జిల్లాలో 20 రోడ్లను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా అంతర్గత రోడ్లు, జిల్లాల సరిహద్దులను కలుపుతూ రహదారులు వేయనున్నారు. అందులో ఆదోని డివిజన్ పరిధిలో గుంతకల్లు- తుంగభద్ర 8.6 కి.మీ రోడ్డు వేయడానికి రూ.3 కోట్లు, ఆదోని-గద్వాల 4 కి.మీ రహదారికి రూ.4కోట్లతో అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అలాగే నంద్యాల జిల్లాలో సరిహద్దులను కలుపుతూ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. మైపాడు- నెల్లూరు-బళ్లారి-ముంబాయి రోడ్డును కలుపుతూ రూ.1.20 కోట్లకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

గతంలో ఇలా..

టీడీపీ హయాంలో రోడ్లను నాసిరకంగా నిర్మించారు. దీంతో అవి కొన్నినెలలకే కంకర, రాళ్లు తేలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వాహనాదారులు, ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొనేవారు. సమస్యను పరిష్కరించాలని అప్పటి పాలకులను కోరినా పట్టించుకునే వారు కాదు. కంకర తేలి, గుంతల మయంగా ఉన్న రోడ్లుకు కనీసం మరమ్మతులు కూడా చేయలేకపోయారు. దీంతో తమ అవస్థలు తప్పవు అన్నట్లు గుంతలు పడిన రహదారులపైనే ప్రజలు ప్రయాణించేవారు.

ప్రస్తుతం ఇలా..

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ప్రధాన, జాతీయ రహదారులను పట్టణ, పల్లె రోడ్లకు అనుసంధానించేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. రోడ్లు బాగా లేవని, నిధులు మంజూరు చేయాలని అధికారులు పంపిన ప్రతిపాదనలకు వెంటనే స్పందిస్తోంది. రోడ్ల పునరుద్ధరణకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తోంది. దీంతో అద్దంలా మారిన రహదారులపై ప్రయాణం సాఫీగా సాగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 65.147 కి.మీ మేర రహదారులు బాగుపడనున్నాయి.

బాగుపడనున్న రోడ్లు, మంజూరైన నిధుల వివరాలు..

రోడ్డు పేరు	పొడవు (కి.మీ)	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
మద్దికెర- పత్తికొండ - దేవనకొండ	10	5.7
మద్దికెర -పత్తికొండ - దేవనకొండ	4	2.3
గుంతకల్లు - తుంగభద్ర	8	3.0
నంద్యాల - నందికొట్కూరు	17.5	9.7
వెలుగోడు- వెల్దుర్తి - ఈదుల దేవరబండ	17.6	8.0
నెల్లూరు - బళ్లారి - ముంబాయి (బనగానపల్లె నియోజకవర్గంలో)	1.9	1.2
డోన్ - రాయచూర్	0.4	0.5
ఆళ్లగడ్డ - అహోబిలం	0.8	3.0
గుండ్లకుంట - సుద్దపల్లి (ఆళ్లగడ్డ నియోజకవర్గంలో)	4.8	3.1



బాగుపడనున్న నందికొట్కూరు - నంద్యాల రోడ్డు

త్వరలో పనులు ప్రారంభిస్తాం



ఈ నెల 26న రాష్ట్ర రహదారులు, 28న జిల్లా రోడ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నాం. త్వరలోనే పనులు ప్రారంభించనున్నాం. మిగతా రోడ్ల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి అనంతపురం, నెల్లూరు, బళ్లారి సరిహద్దు రహదారులను కలపడానికి ప్రణాళిక తయారు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– నాగరాజు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ

గత పాలకులు పట్టించుకోలేదు



ముచ్చుమర్రి నుంచి మోటారు సైకిళ్లపై నందికొట్కూరుకు వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. టీడీపీ హయాంలో రోడ్డు వేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితంలేకుండా పోయింది. గత పాలకులు మా కష్టాలను పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి రోడ్డు వేస్తుండడం చాలా సంతోషంగా ఉంది. – అచ్చన్న, ముచ్చుమర్రి

ప్రయాణ కష్టాలు తొలగుతాయి



నందికొట్కూరు నుంచి నంద్యాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా కష్టాలు తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం చాల సంతోషంగా ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణ కష్టాలు తొలగుతాయి.

– లక్ష్మణ్, నందికొట్కూరు

నెలాఖరుకు 14,821 జగనన్న ఇళ్లు పూర్తి

- హౌసింగ్ పీడీ కే వెంకటనారాయణ



కర్నూలు(అర్బన్): వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నెలాఖరు నాటికి 14,821 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చిందని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కే వెంకటనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంలో ఇప్పటికే 13,905 నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలిన 916 గృహ నిర్మాణాలు కూడా తుది దశకు చేరుకున్నాయన్నారు. జిల్లాలోని 364 జగనన్న కాలనీల్లో 39,331 గృహ నిర్మాణాలను ప్రారంభించినట్లు చెప్పారు. ఆర్‌సీ దశలో 1188, రూఫ్ లెవెల్‌లో 1977, బేస్‌మెంట్ దశలో 10,513, బీబీఎల్ దశలో 11,748 ఉన్నాయని తెలిపారు. మూడో ఆప్షన్ కింద ఉన్న 11,178 గృహ నిర్మాణాలను కూడా సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. బిలో బేస్‌మెంట్ లెవెల్ నుంచి బేస్‌మెంట్ లెవెల్ వరకు తీసుకువచ్చే బాధ్యతను ఆయా మండలాల్లోని ఎంపీడీఓ, తహసీల్దార్, ఏపీఓలకు జిల్లా కలెక్టర్ బాధ్యతలు అప్పగించారని, బేస్‌మెంట్ లెవెల్ నుంచి ఇళ్లు పూర్తి అయ్యేంతవరకు తాము బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఈ నెల 12వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పురోగతిలో కర్నూలు జిల్లా 94 శాతం సాధించి 5వ స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ఆయా గృహ నిర్మాణాలను కూడా పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

లబ్ధిదారులకు రూ.14.16 కోట్ల చేయూత

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పెంచేందుకు ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం రూ.20 వేలను అడ్వాన్స్‌గా అందిస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 7081 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.14,16,20,000 జమ చేశామన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్‌కు ఎలాంటి కొరత లేదని, అలాగే నిర్మించుకుంటున్న ఇళ్లకు ఎప్పటికప్పుడు బిల్లులు కూడా విడుదలవుతున్నాయన్నారు.

రానుపోను టికెట్లపై 10 శాతం రాయితీ

కర్నూలు(రాజ్‌విహార్): రానుపోను టికెట్లు ఒకేసారి రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రానుపోను టికెట్లు ఒకేసారి తీసుకుంటే తిరుగు ప్రయాణానికి మాత్రమే రాయితీ అవకాశం ఉండేదని పేర్కొన్నారు. తాజాగా రెండు టికెట్లకు రాయితీ వర్తింపజేశారని తెలిపారు. ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటికీ వెళ్లి కౌలుదారుల గుర్తింపు

- 50 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలనే లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఇంటింటికీ వెళ్లి వాస్తవ కౌలుదారులను గుర్తించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కౌలుదారుల గుర్తింపు, సీసీఆర్ కార్డుల జారీ ప్రక్రియ జరుగుతోంది. వ్యవసాయ శాఖ జిల్లాకు 7,350 సీసీఆర్ కార్డులు జారీ చేసే విధంగా తాత్కాలిక లక్ష్యాన్ని ఇచ్చింది. అయితే జిల్లా కలెక్టర్ సృజన 10వేలకు పైగా సీసీఆర్ కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ యంత్రాంగం 10,166 కౌలు కార్డులు జారీ చేసింది. వాస్తవ కౌలుదారులకు, సీసీఆర్ కార్డుల జారీకి పొంతన లేదని, ఇంటింటికి తిరిగి వాస్తవ కౌలుదారులను గుర్తించాలని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణద్వివేది ఆదేశించారు. కనీసం 50 వేల వరకు కౌలు కార్డులు ఇవ్వాలని సూచించారు. దీంతో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సాగుదారులను గుర్తించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్‌వరలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్‌ప్రెస్ మెమో జారీ చేశారు. వాస్తవ కౌలుదారులను గుర్తించి సీసీఆర్ కార్డులను జారీ చేయాలని ఏవో, ఏడీఏలను ఆదేశించారు. కార్డులు పొందిన వారితో జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

సేవలోనే సంతృప్తి

నిరుద్యోగ యువతీ, యువకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థలో భాగస్వామ్యులయ్యారు. కొద్దిపాటి గౌరవవేతనం పొందుతూనే ప్రజలకు పలు రకాల ప్రభుత్వ సేవలందిస్తున్నారు. కరోనా కాలంలోనూ ముందుండి నడిచి ప్రశంసలు అందుకున్నారు. బీఎస్సీ (కంప్యూటర్స్) పూర్తి చేసుకున్న వెల్దుర్తి పట్టణం రెండో వార్డుకు చెందిన వలంటీర్ కె దశరథరెడ్డి వలంటీర్‌గా తన పరిధిలోని కుటుంబాలకు సేవలందిస్తున్నాడు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా అవగాహన కల్పిస్తున్నాడు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సేవలు అందిస్తున్నాడు. చేయూత, అమ్మ ఒడి, రైతు భరోసా, ఆసరా, విద్యాదీవెన వంటి పథకాలను తానే దగ్గరుండి దరఖాస్తు చేయించి మంజూరు చేయించాడు. తెలుగు జయలక్ష్మి భర్త లక్ష్మన్న రైలు ప్రమాదంలో మృతి చెందగా ఆమెతో పింఛన్‌కు దరఖాస్తు చేయించాడు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. – వెల్దుర్తి



తెలుగు జయలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ కె. దశరథరెడ్డి (ఫైల్)

ఇంటికొచ్చి సాయమందిస్తున్నారు



వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి. కరోనా కాలంలోనూ వారి సేవలు ఆగలేదు. ఫోన్ చేస్తే చాలు ఇంటికొచ్చి సేవలందిస్తున్నారు. సేవ చేసే గుణం ఉన్న వలంటీర్లు లేకపోతే ప్రతిరోజు పనులకు వెళ్లే మాకు ఇన్ని పథకాలు అందేవి కావు. కుటుంబ దిక్కు కోల్పోయిన మమ్మల్ని పింఛన్ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంది. మా కష్టాన్ని గుర్తించి, దరఖాస్తు చేయించి, పింఛన్ వచ్చేలా వలంటీర్ దశరథరెడ్డి చేసిన సేవను మేం మరచిపోలేం. – జయలక్ష్మి

జీవాలే ఆధారం.. పొలాలే ఆవాసం

- గొర్రెల పెంపకందారుల బతుకు పోరాటం
- వేల కిలోమీటర్ల ప్రయాణం
- వివిధ ప్రాంతాల నుంచి వలస
- గొర్రెలను మేపుతూ, రైతులిచ్చిన కానుకలు స్వీకరిస్తూ జీవనం



పంట పొలాల్లో మేస్తున్న గొర్రెల మంద

మహానంది: ఎండా.. వాన.. చలి వారికి లెక్కే లేదు. ఎంత దూరమైనా కాలి నడకనే. పొలాల గట్లు.. చెట్టు నీడనే వారి ఆవాసాలు. మూగ జీవాలే ఆధారంగా బతుకుబాట పట్టిన గొర్రెల పెంపకందారుల జీవితాలు దగ్గరిగా చూస్తే వారి కష్టం వర్ణనాతీతం. వందల సంఖ్యలో జీవాలు. ఒక్కటి కూడా తప్పిపోకుండా వాటిని కంటికి రెప్పలా కాపలా ఉండాల్సిందే. గడపదాటి బయటికొస్తే మళ్లీ నాలుగైదు నెలలకే వెళ్లేది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల్లో వేసవికాలం వస్తే పంట పొలాలు బీటలు వారతాయి. ఆ సమయంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పంట పొలాల్లో వరి, ఇతర పంటలు కోత పూర్తయి పొలాల్లో మిగిలిన పోయిన వరికాడలు, ఇతర పంటల మేత అందుబాటులో ఉంటుంది. దీంతో రాయలసీమలోని వైఎస్సార్, అనంతపురం జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన గొర్రెల పెంపకందారులు తమ జీవాలతో ఏటా ఇక్కడికి ఇస్తున్నారు. గొర్రెలు, మేకలు, పొట్టేళ్లను మైదాన ప్రాంతాల్లో మేపుకుంటూ కాలికనడక వందల కిలోమీటర్లు ప్రయాణించి నంద్యాల జిల్లాలోని మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు ప్రాంతానికి చేరుకుంటారు.

మంద నిలిపితే సమృద్ధిగా ఎరువు


ఒకటికాదు, రెండు కాదు వందల సంఖ్యలో గొర్రెలు, మేకలను వాటి పెంపకందారులు రైతుల పొలాల్లో నిలపడంతో జీవాలకు మేత లభించడంతో పాటు పొలాలకు సమృద్ధిగా ఎరువు అందుతుంది. గొర్రెలు, మేకల మలమూత్రాలు సహజ ఎరువుగా పనిచేస్తాయి. వీటి ద్వారా భూసారం పెరుగుతుంది. నత్రజని, పొటాష్, భాస్వరం తదితర పోషకాలు పెంపొందుతాయి. భూమి నీటిని నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. జీవాలను నిలిపినందుకు ఎకరాకు రూ. వెయ్యి, రూ. 4 వేల వరకు ఇస్తుంటారని గొర్రెల యజమానులు చెబుతున్నారు. వైఎస్సార్ జిల్లాలోని భీమగుండం, పెద్దముడియం తదితర మండలాల నుంచి వేలాది జీవాలతో మహానంది ప్రాంతానికి వస్తుంటారు. అలాగే కర్ణాటక నుంచి సైతం గొర్రెలు, మేకల పెంపకందారులు వచ్చి మేపుకుంటారు. కర్ణాటక నుంచి వచ్చేవారు సిరిగుప్ప, బళ్లారి, చెన్నూరు, తవుడుగేరి, ఆదోని, సి.బెళగళ్, గూడూరు గ్రామాల మీదుగా మహానంది, బండిఆత్మకూరు మండలాలకు చేరుకుంటారు. వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చేవారు చాగలమర్రి, ఆళ్లగడ్డ, రుద్రవరం, దొర్నిపాడు, యాళ్లూరు, దీబగుంట్ల మీదుగా ఇక్కడికి వచ్చి మేకలు, గొర్రెలను మేపుతారు.

రెండు నెలలు ఇక్కడే ఉంటాం



మాది కర్ణాటకలోని కడక్‌లాట్‌గ్రామం. మేము గత పదేళ్లుగా కర్నూలు, నంద్యాల జిల్లాలకు వస్తున్నాం. ఈ సీజన్‌లో మా ప్రాంతంలోని పంటపొలాల్లో గొర్లు, మేకలకు మేత ఉండదు. దీంతో మహానంది, బండిఆత్మకూరు మండలాలకు వస్తాం. ఇక్కడ ఉన్న వరిపొలాల్లో మిగిలిన కొయ్యలు, ఇతర పంటల్లో ఉన్న గ్రాసాన్ని మేపుకుంటూ జీవనం సాగిస్తాం. పొలాల్లో జీవాలను నిలిపినందుకు రైతులు ఎకరాకు రూ. 2వేలు నుంచి రూ. 4వేలు ఇస్తారు. బట్టలు, భోజనం, ఖర్చులకు డబ్బులిస్తారు. ఇక్కడి రైతుల సహకారం ఎంతో ఉంది. రెండు, మూడు నెలలు ఇక్కడే జీవాలను మేపుకుని ఆ తర్వాత గ్రామానికి చేరుకుంటాం.

– వీరప్ప, బెళ్గాం జిల్లా, కర్ణాటక



అన్నింటిని ఒకచోట చెట్టుకిందకి తోలుతున్న కృష్ణుడు


కొన్నింటిని విక్రయిస్తాం



మాకు ఎనిమిది వందల గొర్రెలు, మేకలు ఉన్నాయి. మా ప్రాంతంలో మేత లేకపోవడంతో ఆళ్లగడ్డ మీదుగా అన్ని గ్రామాలు తిరుగుతూ మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని పంట పొలాలకు తీసుకొచ్చాము. ఈ గ్రామాల్లో మాకు అందరూ తెలిసినవారే. గత ఇరవై ఏళ్లుగా వస్తున్నాం. రైతులు ఎంతో ఆప్యాయతతో మమ్మల్ని చేరదీస్తుంటారు. పొలాల్లో నిలిపినందుకు పారితోషికం, భోజనం, వస్త్రాలు ఇస్తారు. ఉన్నవాటిలో కొన్నింటికి ఇక్కడే మేపుకునేవారికి విక్రయిస్తుంటాం. ఎక్కువ తీసుకొన్నవారికి ఒకటి, రెండు ఉచితంగా ఇస్తాం.

– బాలగుర్రప్ప, భీమగుండం, వైఎస్సార్ జిల్లా:

మంద నిలిపితే భూమికి మంచి ఎరువు



గొర్రెలు, మేకల మందలను పొలాల్లో నిలిపితే ఆ ఏడాది పంటకు ఎరువులు అందినట్లే. సహజసిద్ధంగా లభించే వాటి ఎరువు పంటకు ఎంతో మంచిది. ఫలితంగా పంటల దిగుబడి సైతం పెరుగుతుంది. రాయలసీమలోని జిల్లాలతో పాటు కర్ణాటక నుంచి ఈ ప్రాంతాలకు ఎక్కువగా వస్తాయి. వేలసంఖ్యలో రావడంతో వారికి రైతులు సహకరిస్తూ వారిపొలాల్లో నిలుపుకోవాలి. – కాకనూరు సుబ్బయ్యయాదవ్, గొర్రెల పెంపకందారుల సంఘం డైరెక్టర్

క్లుప్తంగా

టెండర్లపై అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు (టౌన్): తుంగభద్ర నదిలో రూ.131.84 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి టెండర్లు రూపొందించామని, వీటిని జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపినట్లు ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఎస్ఈ శ్రీనాథ్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్యుడీషియల్ ప్రివ్యూలో సంబంధిత కాంట్రాక్టర్లు, ఇతరుల నుంచి ఈనెల 19వ తేదీ వరకు సలహాలు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారిక వెబ్‌సైట్ https//judicialpreview.ap.gov.in/projects&received/లో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్, డాక్యుమెంట్లను పొందుపరచినట్లు తెలిపారు.

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో అగ్నివీర్‌-వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌మీడియట్/డిప్లొమా పూర్తి చేసుకున్న వారు ఈ నెల 27వ తేది నుంచి ఆగస్టు 17వ తేది వరకు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబర్ 13వ తేదీ తర్వాత ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అనంతరం శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు, నోటిఫికేషన్ కోసం https:// agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలకు రూ.4 కోట్లు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ భవన (రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్) నిర్మాణాలకు రూ.4 కోట్లు విడుదలైనట్లు పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందుకు అనుగుణంగానే బిల్లులను విడుదల చేస్తోందన్నారు. వేర్వేరు దశల్లో కొనసాగుతున్న నిర్మాణాలకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాధాన్యత భవనాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో ఉన్న ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

డోన్ టౌన్: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే సంస్థ ధ్యేయమని దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధనుంజయులు అన్నారు.రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి డోన్‌లో అదనపు టికెట్ కౌంటర్‌తో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో ఏజీఎం బుధవారం డోన్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి అభివృద్ధి పనులపై చర్చించారు. రైల్వే స్టేషన్ అవతలి వైపు అప్రోచ్ రోడ్డుతో పాటు అదనపు టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీఆర్ఎం సుధాకర్, స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆనందమానందమాయె!

- జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో మధ్యతరగతి ప్రజలకు ప్లాట్ల కేటాయింపు



టౌన్‌షిప్‌లో స్థలాలు తీసుకొన్న ఉద్యోగులు, పెన్షనర్లు, మధ్య తరగతి వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ఎమ్మిగనూరుటౌన్: ఎవరి సిఫార్సు లేకుండా పారదర్శకంగా జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో రాష్ట్ర ప్రభుత్వమే ప్లాట్లు కేటాయించడంతో మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఎమ్మిగనూరు మండలం బనవాసి నవోదయ వద్ద 110 ఎకరాల్లో 1,106 ప్లాట్లను వేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్యతరగతి చెందిన వారు 117 మంది 10 శాతం డబ్బు చెల్లించారు. దీంతో వారికి బుధవారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ డిప్ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్(కుడా) వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు చేసినట్లు చెప్పారు. మొత్తం డబ్బు ఒకే సారి చెల్లిస్తే వెంటనే వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ వ్యక్తులు చేసే వెంచర్లల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేడయడం కంటే ప్రభుత్వ స్మార్ట్‌టౌన్‌షిప్‌లో స్థలాలు తీసుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపల్ కమిషనర్లు గంగిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కుడా ప్లానింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ టీపీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చాలా సంతోషం



రిటైర్డ్ ఉద్యోగుల కోటాలో ప్లాట్ కోసం 10 శాతం డబ్బు చెల్లించా. ఎవరి సిఫారసుల్లేకుండా ప్లాట్ నంబర్ 648 వచ్చింది. అందులో ప్లాట్ ముందు పార్క్, కార్నర్ బిట్ రావడం చాలా సంతోషంగా ఉంది.
– లక్ష్మణ్‌దాస్, రిటైర్డ్ తహశీల్దార్, ఎమ్మిగనూరు

పారదర్శకంగా ప్లాట్ కేటాయింపు



జగనన్న స్మార్ట్‌టౌన్ షిప్‌లో ప్లాట్ల కేటాయింపు పారదర్శకంగా ఉంది. ఆన్‌లైన్ డిప్‌లో నాకు ప్లాట్ నంబర్ 689 వచ్చింది. అందులోను ప్లాట్ ముందు 60 అడుగుల రోడ్డు ఉంది. టౌన్‌షిప్‌లో ప్లాట్ల కేటాయింపులో ఎలాంటి వివక్ష లేకుండా డిప్‌ద్వారా కేటాయించారు. – గురురాజారావు,
న్యాయవాది, ఎమ్మిగనూరు

రూ.2 కోట్లతో చిట్టీల వ్యాపారి పరారీ!

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఎమ్మిగనూరు: చిట్టీల పేరు దగా చేసి రూ.2 కోట్లతో ఓ వ్యాపారి పరారయ్యాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎమ్మిగనూరు పట్టణం సోమప్పనగర్‌లో కిరాణ వ్యాపారం చేస్తున్న మాదుగుండు శ్రీనివాసులు మూడేళ్లగా ఫైనాన్స్ వ్యాపారం మొదలు పెట్టాడు. తన దగ్గర ఫైనాన్స్ పొందేవారినే మెంబర్లుగా చేసుకుంటూ చిట్టీల వ్యాపారం చేసేవాడు. రూ. 50వేల నుంచి రూ. 5లక్షలు వరకూ చిట్టీలు వేస్తూ వచ్చేవాడు. చిట్టీల్లో ఎక్కువ సంపాదిస్తునంటూ పలువురి దగ్గర లక్షల రూపాయల్లో అప్పు చేశాడు. చిట్టీలు వేసిన వారికి డబ్బులివ్వక, అప్పుదారులకు అప్పు చెల్లించక వాయిదా వేస్తూ వచ్చాడు. సుమారు రూ.2 కోట్లకు పైగా చిట్టీల సొమ్ము, అప్పుచేసి పోగేసుకున్న డబ్బులతో నాలుగురోజుల క్రితం పరారైనట్లు సోమప్పనగర్ వాసులు చెప్పుకొంటున్నారు. బాధితుల్లో కిరాణ, దుస్తుల, వడ్రంగి వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తోంది. రూ.5లక్షలు చిట్టీ డబ్బు చెల్లించక పోవడంతో బుధవారం వడ్రంగి వ్యాపారి నాగేశ్ ఆచారి దంపతులు పట్టణ పోలీసు స్టేషన్‌లో శ్రీనివాసులుపై ఫిర్యాదు చేశారు.

రూ.17.14 కోట్ల విలువైన విత్తనాల అమ్మకాలు నిలిపివేత



పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉండటంతో హైబ్రిడ్ పత్తి విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని.. అనధికార, నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నకిలీ, అనధికార విత్తనాలను నియంత్రించేందుకు డీలరు షాపులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలు, కొరియర్ సర్వీస్‌ల్లో తనిఖీలకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 735 విత్తన విక్రయ కేంద్రాలు ఉన్నాయని, ప్రతిచోటా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా అంతర్గత తనిఖీ బృందాలు కొద్ది రోజులుగా తనిఖీలు నిర్వహించి రూ.12.16 కోట్ల విలువ కలిగిన 4,368 క్వింటాళ్ల పత్తి విత్తనాల అమ్మకాలు నిలిపివేశామని, రూ.11.7 లక్షల విలువ కలిగిన 5,922 క్వింటాళ్ల పత్తి విత్తనాలను సీజ్ చేసి 6ఏ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాల ద్వారా ఇప్పటి వరకు రూ.4.98 కోట్ల విలువ కలిగిన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. రూ.1.68 లక్షల విలువ కలిగిన విత్తనాలను 6ఏ కేసుల ద్వారా సీజ్ చేసినట్లు వివరించారు. రైతులు విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలరు వద్దనే కొనుగోలు చేసి తగిన బిల్లు తీసుకోవాలని సూచించారు.

21 కిలోల గంజాయి సీజ్

- ఇద్దరు విక్రయదారులు అరెస్టు



వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి సంచులు, పొట్లాలు

కర్నూలు: యువకులే లక్ష్యంగా గంజాయి వ్యాపారం సాగిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. అరకు నుంచి కిలో రూ.10 వేల ప్రకారం కొనుగోలు చేసి తీసుకువచ్చిన గంజాయిని స్థానికంగా పొట్లాలు కట్టి 100 గ్రాములు రూ.500 ప్రకారం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా వేసి ఇద్దరిని వలపన్ని పట్టుకున్నారు. సుంకేసుల రోడ్డులోని క్రిస్టియన్ శ్మశాన వాటిక వెనుకభాగంలో ఉన్న కాంపౌండ్‌లో కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన మనోహర్ అలియాస్ బ్రో, గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు కలసి గంజాయి అమ్మకాలు సాగిస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఏడాది కాలంగా ఈ వ్యాపారం సాగిస్తున్నట్లు విచారణలో వారు అంగీకరించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు రెండవ పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

చిరు వ్యాపారి బలవన్మరణం



ఆత్మహత్యకు పాల్పడిన తిరుపాల్‌రెడ్డి

కర్నూలు: కుటుంబం గడవక చిరు వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు మండలం ముజఫర్ నగర్‌లోని ఆటోస్టాండ్ సమీపంలో తిరుపాల్‌రెడ్డి (37) నివాసముంటున్నాడు. ఈయన పాత కల్లూరు చౌడేశ్వరి దేవాలయం వద్ద టీస్టాల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపారం సరిగా జరగక, కుటుంబ ఖర్చులు పెరిగిపోయి కొంతకాలంగా సతమతమయ్యేవాడు. బుధవారం తెల్లవారుజామున టీస్టాల్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి వెంకటాచలపతి నగర్ రోడ్డు ప్రారంభం దగ్గర ఉన్న శిల్పా కూల్‌డ్రింక్స్ దుకాణం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈయనకు ఒక కుమార్తె సంతానం.

చోరీకి వెళ్లి.. ప్రాణాల మీదకు తెచ్చుకుని !



దిగలేక కిటికీ పైకప్పుపై కూర్చున్న దొంగ

బొమ్మలసత్రం: చోరీకి వెళ్లిన ఓ దొంగ తప్పించుకునే క్రమంలో ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. బుధవారం నంద్యాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాణ్యం మండల కేంద్రంలోని చెంచుకాలనీకి చెందిన అంజి మంగళవారం నంద్యాల పట్టణానికి వచ్చాడు. రాత్రి పట్టణంలోనే పడుకుని వేకువజామున చోరీ చేసేందుకు సంజీవనగర్ సెంటర్‌లో ఉన్న సాయిబాలాజీ ఆసుపత్రిని ఎంచుకున్నాడు. చోరీ చేసేందుకు యత్నిస్తుండగా అప్పుడే ఆసుపత్రి పైన ఉన్న ఇంట్లో నుంచి డాక్టర్ హరినాథ్‌రెడ్డి బయటకు వచ్చాడు. గమనించిన దొంగ తప్పించుకునే క్రమంలో పై అంతస్తు నుంచి కిందకు దూకి నాలుగో అంతస్తు కిటికీ పైకప్పుపై దాక్కున్నాడు. ఆ తర్వాత పైకి ఎక్కేందుకు వీలుకాక కిందకు దిగేందుకు ఆధారం లేక ప్రాణభయంతో అక్కడే ఉండిపోయాడు. గమనించిన డాక్టర్ విషయం టూటౌన్ పోలీసులకు చెప్పడంతో అగ్నిమాపకశాఖ అధికారులతో కలిసి వారు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. దాదాపు 6 గంటల పాటు శ్రమించి దొంగను భవనంపై నుంచి కిందకు దింపి స్టేషన్‌కు తరలించారు.

వలంటీర్లను కించపరచడం దారుణం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు(అర్బన్): ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సేవలు అందిస్తున్న వలంటీర్లను కించపరుస్తూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడటం దారుణమని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. వలంటీర్లు చేస్తున్న నిస్వార్థ సేవతో రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే విమర్శలు చేస్తున్నారన్నారు. అతి తక్కువ గౌరవ వేతనంతో ప్రజలకు సేవ చేస్తున్న వారిపై నిందలు వేయడం సరికాదన్నారు. కరోనా సమయంలో స్నేహితులు, బంధువులు కూడా దగ్గరకు రాలేని పరిస్థితుల్లో ప్రతి ఇంటికి వెళ్లి వలంటీర్లు విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా కరోనా ఎంత మందికి సోకింది, ఎంత మంది మృత్యువాత పడ్డారు.. అనే లెక్కలు లేవన్నారు. అయితే మన రాష్ట్రంలో వలంటరీ వ్యవస్థ చక్కగా పనిచేయడంతో కరోనాకు సంబంధించిన పూర్తి సమాచారం ఉందన్నారు. వలంటరీ వ్యవస్థను ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ప్రశంసిస్తుంటే, పవన్ కళ్యాణ్‌కు వారి సేవలు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. వలంటీర్ల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేందుకు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతున్నారన్నారు. వ్యవస్థలో ఏవైనా లోపాలుంటే తెలియజేయాలని, ప్రభుత్వం వాటిని సరిదిద్దుకుంటుందన్నారు. పసలేని అభాండాలు వేస్తే వలంటీర్లు కుంగిపోయి సేవలకు దూరమవుతారనే దుర్బుద్ధితో గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు, నేడు పవన్‌కళ్యాణ్ ఈ రకంగా మాట్లాడటం శోచనీయమన్నారు.

వ్యభిచారం ముఠా గుట్టురట్టు

బొమ్మలసత్రం: పట్టణంలోని స్థానిక బొమ్మల సత్రం సమీపంలో ఉన్న సీపీఆర్ లాడ్జీలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన రఘునాథరెడ్డి కడప జిల్లా నుంచి ముగ్గురు మహిళలను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం లాడ్జీపై దాడి చేసి నిర్వాహకుడితో పాటు ముగ్గురు మహిళలు ఆరుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ నరసింహులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- వైద్యులు సమయ పాలన పాటించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): విధుల్లో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు నిర్దేశించిన సమయంలో తప్పనిసరిగా ఆసుపత్రిలో ఉండి సేవలు అందజేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏరియా ఆసుపత్రులపై ఫిర్యాదులు వస్తున్నాయని, ముఖ హాజరుశాతాన్ని పర్యవేక్షిస్తూ ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావుకు సూచించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి శస్త్రచికిత్స కోసం జిల్లాలో 8,512 మందిని గుర్తించారని, అందులో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 7,623 మందికి శస్త్ర చేశారని కలెక్టర్ అన్నారు. మిగిలిన 889 మందికి త్వరలో నాణ్యతతో కూడిన శస్త్ర చికిత్స చేయాలని కంటి వెలుగు జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భరత్‌ను ఆదేశించారు. ఆగస్టు 15వ తేది నాటికి పెండింగ్‌లో ఉన్న 9,171 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయాలన్నారు. ఆలూరులో స్కానింగ్ కోసం వచ్చే గర్భిణులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం ఫీడ్‌బ్యాక్ శాతాన్ని మెరుగుపరచాలని, ఎన్‌సీడీ సర్వేను త్వరిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గత వారంలో పెద్ద తుంబళం, కర్నూలు మార్కెట్‌యార్డు ప్రాంతంలోని ఏఎన్ఎంలు తమ పనిలో పురోగతి చూపించలేదని, వారిపైన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్యను ఆదేశించారు. ప్రతి ఏఎన్ఎం వారంలో ఐదు స్క్రీనింగ్‌లు తప్పకుండా చేయాలని, అలా చేయని వారిపై చర్యలు తప్పవన్నారు. జిల్లా మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ జిల్లాలో ఒకటి, రెండు ప్రాంతాల్లో డెంగీ వ్యాధి గుర్తించామని, నివారణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్,ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15 నాటికి భవన నిర్మాణాలు పూర్తికావాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలన్నీ సెప్టెంబర్ 15నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ పనులు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు రోజులకు ఒకసారి స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. చేసిన పనులకు నిధుల కొరత లేదన్నారు. దేవనకొండ, కల్లూరు, కృష్ణగిరి, ఆస్పరి మండలాల్లో ఉపాధి పనిదినాలను తక్కువగా కల్పించారన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

మహిళామార్ట్ సందర్శన



చేయూత మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ ఎండీ ఆనంద్‌బాబు

కోడుమూరు: పట్టణంలో పొదుపు మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటైన చేయూత మహిళా మార్ట్ ను చత్తీస్‌ఘడ్‌కు చెందిన పీసీసీఎఫ్ ఫెడరేషన్ అడిషనల్ ఎండీ ఆనంద్‌బాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మహిళమార్ట్ నిర్వహణ ఎలా కొనసాగుతోంది, పెట్టుబడి ఏ విధంగా సమకూర్చుకున్నారు, వ్యాపారం ఎలా ఉంది అన్న అంశాలపై కోడుమూరు ఏపీఎం పుష్పావతి, మార్ట్ నిర్వాహకులతో చర్చించారు. అనంతరం మార్ట్ నిర్వహణ తీరు చాలా బాగుందని కితాబునిచ్చారు. అడిషనల్ ఎండీ ఆనంద్ బాబు వెంట డీఆర్‌డీఏ వైకేపీ పీడీ నాగశివలీల, ఏపీడీ శ్రీధర్, ఏపీఎం శ్రీనివాసులు, మహిళామార్ట్ కమిటీ సభ్యులు ఉన్నారు.

‘ఉపాధి’ సమస్యలపై ఫిర్యాదు చేయండి



కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్

నంద్యాల(సెంట్రల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని జిల్లా అంబుడ్స్‌పర్సన్ సురేంద్ర కుమార్ అన్నారు. బుధవారం ఆయన నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ పథకంలో భాగమైన గ్రామసభల సమావేశాలు, జాబ్ కార్డ్స్ జారీ, వేతనాల చెల్లింపుల్లో జాప్యం, పని కల్పనలో అలసత్వం, లింగ వివక్షత, పని ప్రదేశంలో సౌకర్యాలు, మంచినీటి వసతి కల్పించకపోవటం, పనుల నాణ్యత, సామాజిక తనిఖీలో లోపాలు, మస్టర్ రోల్స్, పత్రాల తనిఖీ ఇలా పలు అంశాల్లో ఏవైనా సమస్యలుంటే తెలియజేయవచ్చునన్నారు. అయితే, ముందుగా మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వారు స్పందించకపోతే తన సెల్ నంబరు 9154840106కు సంప్రదించాలన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

పాములపాడు: పండ్ల తోటల పెంపకంతో రైతులు మంచి లాభాలు గడించవచ్చని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని చెలిమిల్ల, లింగాల గ్రామాల్లో కొబ్బరి చెట్లు నాటేందుకు రైతు పొలంలో తీస్తున్న గోతులను పరిశీలించారు. కూలీలతో మాటాడుతూ నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తేనే కచ్చితమైన కూలి పడుతుందని చెప్పారు. 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పని ప్రాంతాల్లో ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. ఆయన వెంట ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోడు తోడై.. నవ్వుల పువ్వులై

కష్టం..సుఖం, ఆశ..నిరాశ, దుఃఖం.. సంతోషం.. ఏవీ ఎక్కువ రోజులు ఉండవు. ఒకదాని తర్వాత ఒకటి వస్తూ పోతూ ఉంటాయి. ఎత్తు పల్లాల జీవన గమనంలో ప్రతి ఒక్కరూ వీటిని అనుభవించే ఉంటారు. ప్రకృతి మహిమో, లేదంటే సృష్టికర్త సందేశమో.. ఆశను, నిరాశను చూపుతూ, దుఃఖాన్ని, సంతోషాన్ని తెలియజేస్తూ ఓ దృశ్యం బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం సమీపంలో ఆవిష్కృతమైంది. ఒక వైపు కాయలతో సహా ఎండిన నుంకేసుల వృక్షం.. మరో వైపు అలాంటి వృక్షమే దెబ్బతగిలినా సడలని సంకల్పంతో ఎర్రపూలతో వికసించిన దృశ్యం.. పక్కనే పంటకు ప్రాణం పోయడానికి సిద్ధంగా ఉన్న పొలం .. దూరంగా ఆకాశంలో వర్షించడానికి సిద్ధంగా ఉన్న నల్లని మేఘాలు..తాత్విక దృష్టికి అద్దం పట్టాయి. –ఫొటో: డి. హుస్సేన్

